క్లుప్తంగా

ఇంజినీరింగ్‌ విద్యార్థులకు అన్యాయం చేయొద్దు



అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్‌ విద్యార్థులకు మూడో విడత కౌన్సిలింగ్‌ నిర్వహించాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ అన్యాయం చేయొద్దని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి వలరాజు పేర్కొన్నారు. ఏఐఎస్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌ వరకు ర్యాలీ, అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19,000 మంది విద్యార్థులు డబ్బు పెట్టి మేనేజ్‌మెంట్‌ సీటు కొనలేకపోతున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న 75 శాతం బకాయిలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌, నాయకులు బి తేజ, అకీరాచంద్ర, అరుస్‌, మస్తాన్‌, రాజేష్‌, విహారి ప్రణవ్‌, సాయి షరీఫ్‌, తదితరులు పాల్గొన్నారు.

చెత్త పాయింట్లను శుభ్రం చేయాలి

కడప కార్పొరేషన్‌ : కడప నగరంలోని చెత్త పాయింట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అదనపు కమిషనర్‌ రాకేష్‌ చంద్రన్‌ పేర్కొన్నారు. శుక్రవారం మార్నింగ్‌ విజిట్‌లో భాగంగా నార్త్‌ జోన్‌ చెన్నూరు బస్టాండ్‌, బళ్లారి రోడ్‌, నకాష్‌ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు వారికి కేటాయించిన సమయానికి విధులకు హాజరు కావాలన్నారు. లోడర్లు, డ్రైవర్లు వారికి కేటాయించిన మార్గంలో కొత్తగా చెత్త పాయింట్లు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కనీసం మూడు ట్రిప్పులు తిరిగి చెత్త లేకుండా శుభ్రం చేయాలన్నారు. ప్రతి క్లాప్‌ వాహనం 700 కిలోల చెత్తను లోడ్‌ చేసుకోవాలన్నారు. చెత్త సేకరణ వందశాతం జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ వెంకట సుబ్బయ్య, శానిటేషన్‌ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేయర్‌ జన్మదిన వేడుకలు


కేక్‌ కట్‌ చేస్తున్న కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జులు

కడప కార్పొరేషన్‌ : వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ రీజినల్‌ కోఆర్డినేటర్‌, కడప మేయర్‌ కె. సురేష్‌ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక అపూర్వ ఫంక్షన్‌ హాలులో 13వ డివిజన్‌ కార్పొరేటర్‌ ఎం.రామలక్ష్మణ్‌రెడ్డి ఆధ్వర్యంలో తెచ్చిన భారీ కేక్‌ను కార్పొరేటర్లు, డివిజన్‌ ఇన్‌చార్జులు కట్‌ చేసి మేయర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షఫీ, అజ్మతుల్లా, ఎం.సుబ్బారెడ్డి, డివిజన్‌ ఇన్‌చార్జులు శ్రీరంజన్‌రెడ్డి, కిరణ్‌, బండి ప్రసాద్‌, ఐస్‌క్రీం రవి, వీరారెడ్డి, చల్లా రాజశేఖర్‌, గౌస్‌, పార్టీ నాయకులు సీహెచ్‌ వినోద్‌ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాజీ డిప్యూటీ సీఎం


కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న ఎస్‌బీ అంజద్‌బాషా

కడప కార్పొరేషన్‌ : వైఎస్సార్‌ జిల్లా కలెక్టర్‌ లోతేటి శివశంకర్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా కలిశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

బుద్ధదేవ్‌ భట్టాచార్య మృతి తీరని లోటు


బుద్ధదేవ్‌ భట్టాచార్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : పశ్చిమబెంగాల్‌ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్‌ భట్టాచార్య మృతి వామపక్ష పార్టీలకు తీరని లోటని సీపీఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్‌, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని సీపీఎం కార్యాలయంలో బుద్ధదేవ్‌ భట్టాచార్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బుద్ధదేవ్‌ భట్టాచార్య దేశానికి, బెంగాల్‌ రాష్ట్రానికి ఎన్నో సేవలందించారని అన్నారు. ఆయనను యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు రామ్మోహన్‌, దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అన్వేష్‌, చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, గోపాల కృష్ణయ్య, రంగారెడ్డి, చిన్న సిద్దయ్య, మస్తాన్‌ తదితరులు పాల్గొన్నారు.

మంచి నీరు.. ఇవ్వండి సారూ..


విద్యుత్‌ నగర్‌లో ఉప్పు నీటిని సరఫరా చేసే బోరు


మురుగు కాలువగా మారిన కేసీ కాలువ

- బోరు నుంచి వస్తున్న ఉప్పు నీరు
- విద్యుత్‌ నగర్‌ వాసులకు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

కడప ఎడ్యుకేషన్‌ : కడప నగరం చిన్నచౌక్‌ పంచాయతీలోని 6వ వార్డు–1 పరిధిలోని విద్యుత్‌నగర్‌ (రోడ్డు నంబర్‌–3, 4, 5) వాసులు మంచినీటి (మున్సిపల్‌ వాటర్‌)కి నోచుకోవడం లేదు. ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన బోరు నుంచి 24 గంటలు నీరు వదులుతున్నారని స్థానికులు తెలిపారు. ఈ బోరు నుంచి ఉప్పునీరు (జౌకులు) వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగేందుకు కూడా వీలు కాకుండా ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. ఆ నీటితో చేసుకుంటే అన్నం పచ్చగా అవుతోందని పేర్కొన్నారు. స్నానం చేస్తే ఒళ్లంతా బంకగా ఉంటుందని తెలిపారు. మున్సిపల్‌ నీరు వచ్చే సమయంలో కూడా.. ఉప్పు నీటి బోరు అట్లే ఆడుతుండటంతో.. మున్సిపల్‌ నీరు వచ్చేందుకు వీలు కావడం లేదని తెలిపారు.

బోరు నీరు ఒక గంట ఆపితే..

మున్సిపల్‌ వాటర్‌ను వదిలినప్పుడు స్థానికంగా ఉండే బోరును ఒక గంట పాటు ఆపితే కాలనీ వాసులంతా పట్టుకునేందుకు వీలవుతుందని స్థానికులు తెలిపారు. 14 ఏళ్ల నుంచి మున్సిపాలిటీ (మంచి నీటికి) నీటికి అలవాటు పడ్డామని, ఇప్పుడు బోరు బావి నీరు తాగడం వల్ల చాలా మంది అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వారి నుంచి స్పందన లేదని తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యేతోపాటు గ్రీవెన్స్‌సెల్‌కు కూడా తీసుకెళ్లామని పేర్కొన్నారు.

కేసీ కాస్తా మురుగు కాలువగా...

విద్యుత్‌నగర్‌ దగ్గర నుంచి కేసీ కాలువ కాస్తా మురుగుకాలువగా మారింది. స్థానికంగా ఉండే వాళ్లు చెత్తా చెదారాన్ని దాంట్లో వేయడంతోపాటు గ్రామంలోని మురుగునీరు ఆ కాలువలోకి చేరడంతో కేసీ కాలువ కాస్తా మురుగు కాలువగా మారింది. దీంతోపాటు కేసీ కాలువ చెట్లతో మూసుకుపోవడంతో దోమలకు ఆవాసంగా మారింది. గుడి పక్కనే కాలువ ఉండటంతో భక్తులకు మురుగు కంపు కొడుతోందని స్థానికులు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మున్సిపాలిటీ నీరు వచ్చే సమయంలో..



మున్సిపాలిటీ నీరు వదిలిన తర్వాత స్థానికంగా ఉన్న బోరు మోటారు బంద్‌ చేస్తే పట్టుకుంటాం. మున్సిపల్‌ వాటర్‌ వస్తున్న సమయంలో కూడా మోటార్‌ను బంద్‌ చేయకపోవడం వల్ల మున్సిపాలిటీ నీటిని పట్టుకోలేక పోతున్నాం. బోరు వాటర్‌ కాస్తా ఉప్పుగా ఉంటాయి. దీంతో ఆ నీటిని తాగలేకున్నాం.

– శైలజ, విద్యుత్‌నగర్‌, కడప

నీటి సరఫరా వేళలు తెలిపాలి



స్థానికంగా ఉండే బోరు నుంచి వచ్చే ఉప్పు నీటిని తాగడం చాలా ఇబ్బందిగా ఉంది. నీరు ఉప్పుగా ఉండటం వల్ల అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుంది. ఈ విషయంలో అధికారులు స్పందించి న్యాయం చేయాలి. దీంతోపాటు మున్సిపాలిటీ నీటి సరఫరా వేళలు కూడా తెలియ చేయాలి.

– శ్రీధర్‌రావు, విద్యుత్‌నగర్‌, కడప

స్వాతంత్య్ర దినోత్సవ సంచిక ఆవిష్కరణ


కడప కల్చరల్‌ : మన చరిత బులెటిన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌, ఇంటాక్‌ ప్రతినిధులు

కడప కల్చరల్‌ : భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్‌) కడప చాప్టర్‌ ఆధ్వర్యంలో రూపొందించిన మన చరిత స్వాతంత్య్ర దినోత్సవ ప్రత్యేక బులెటిన్‌ను శనివారం జిల్లా కలెక్టర్‌ శివశంకర్‌ లోతేటి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఆగస్టు సంచికను స్వాతంత్య్ర దినోత్సవ సంచికగా రూపొందించిన సందర్భంగా జిల్లాలోని స్వాతంత్య్ర సమరయోధులు, ఆనాటి అపురూపమైన ఘట్టాలతో ఈ సంచికను రూపొందించినట్లు చాప్టర్‌ జిల్లా కన్వీనర్‌ లయన్‌ కె.చిన్నపరెడ్డి తెలిపారు. అందులోని పలు అంశాలను తిలకించిన కలెక్టర్‌ ఒకే అంశంపై ఇన్ని కథనాలను సేకరించి ప్రచురించినందుకు అభినందించారు. సెప్టెంబరు సంచిక గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇంటాక్‌ ప్రతినిధులు కొండూరు జనార్దన్‌ రాజు, గౌరీశంకర్‌, గురుమోహన్‌రెడ్డి, శ్వేత, మునికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.


వైవీయూ: సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథరెడ్డి

భారీ త్రివర్ణ పతాకంతో స్వాతంత్య్ర వేడుకలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో 350 అడుగుల భారీ త్రివర్ణ పతాకంతో స్వాతంత్య్ర దినోత్సవ సంబరాలు నిర్వహించనున్నట్లు వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌, ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌.రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవ సంబరాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయభావం పెంపొందించడంలో భాగంగా వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయంలో పని చేసే ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ ఆచార్య పి.పద్మ, సీడీసీ డీన్‌ కె.రఘుబాబు, వ్యాయామవిద్య విభాగాధిపతి కె.రామసుబ్బారెడ్డి, ఎస్‌.పి.వెంకటరమణ, కె.గంగయ్య, ఎస్‌.సుబ్బారెడ్డి, కె.రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. :

26 మంది ఎంపీడీఓల బదిలీ

కడప సెవెన్‌రోడ్స్‌ : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కడప, అన్నమయ్య జిల్లాలకు బదిలీపై వచ్చిన 26 మంది ఎంపీడీఓలను తిరిగి వారి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిని రిలీవ్‌ చేస్తూ జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి ప్రొసీడింగ్స్‌ ఇచ్చారు. బి.మఠం, మైదుకూరు, కాశినాయన, సిద్దవటం, అట్లూరు, దువ్వూరులలో పని చేస్తున్న శివమల్లేశ్వరప్ప, ఫజుల్‌ రెహ్మాన్‌, మధుసూదన్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, అమానుల్లా, సుగుణశ్రీలను సొంత జిల్లా అయిన కర్నూలుకు బదిలీ చేశారు. బద్వేలు, కలసపాడులలో పని చేస్తున్న రజనీకాంత్‌, కోటేశ్వరరావులను నెల్లూరు జిల్లాకు పంపారు. ఒంటిమిట్ట, లింగాల, సీకే దిన్నె, వల్లూరు, పెద్దముడియం, పులివెందుల, సింహాద్రిపురంలలో పని చేస్తున్న ఎంపీడీఓలు రామచంద్ర, తేజోష్ణ, షకీలా బేగం, విజయభాస్కర్‌, లక్ష్మీనరసింహ, దివాకర్‌, సాల్మన్‌లను అనంతపురం జిల్లాకు పంపారు. ఇక అన్నమయ్య జిల్లాలోని సుండుపల్లె, రాయచోటి ఎంపీడీఓలు అమర్‌నాథ్‌, సురేంద్రనాథ్‌లను చిత్తూరుకు బదిలీ చేశారు. పుల్లంపేట, గాలివీడు, రామాపురం, చిన్నమండెం, ఓబులవారిపల్లె, సంబేపల్లె, చిట్వేలి మండలాల్లోని ఎంపీడీఓలు నరసింహమూర్తి, శ్రీనివాసులు, ప్రభాకర్‌, రామకృష్ణ, కుళ్లాయిస్వామి, యోగానందరెడ్డి, నిర్మలాకుమారి, వెంకట రంగారావులను అనంతపురం జిల్లాకు బదిలీ చేయగా, రైల్వేకోడూరులో పని చేస్తున్న కేవీ సుబ్రమణ్యంను కర్నూలు జిల్లాకు పంపారు.

కోర్సుల ఎంపికకు కెరీర్‌ కౌన్సెలింగ్‌ ఉపయుక్తం

కడప స్పోర్ట్స్‌ : కోర్సులు ఎంపిక చేసుకోవడంలో కెరీర్‌ కౌన్సెలింగ్‌ ఎంతో ఉపయోగపడుతుందని స్టెప్‌ సీఈఓ సి.సాయిగ్రేస్‌ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగర పరిధిలోని అన్నమాచార్య ఇంజినీరింగ్‌ కళాశాలలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో కెరీర్‌ కౌన్సెలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన మార్గదర్శనం పొందడం ద్వారా కోర్సుల ఎంపికతో సగం విజయం సాధించవచ్చన్నారు. సరిగ్గా అంచనా వేయకుంటే తోటి వారి ఒత్తిడి, ఎక్కువ మంది ఎంపిక చేసుకున్న కోర్సులను ఎంచుకోవడానికి దారితీస్తుందన్నారు. అనంతరం కెరీర్‌ కౌన్సిలర్‌ వి.భాస్కర్‌వర్మ కెరీర్‌ కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టెప్‌ మేనేజర్‌ వి.వి.సుబ్బారాయుడు, సిబ్బంది నారాయణ, అబ్బాస్‌అలీ, కళాశాల అధ్యాపకులు శశికుమార్‌, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్టెప్‌ సీఈఓ సి.సాయిగ్రేస్‌

12 నుంచి డిగ్రీ ఇన్‌స్టంట్‌ పరీక్షలు

వైవీయూ: వైవీయూ డిగ్రీ ఇన్‌స్టంట్‌ పరీక్షలు ఈనెల 12 నుంచి ప్రారంభమవుతాయని వైవీయూ కంట్రోలర్‌ ఆఫ్‌ ఎగ్జామినేషన్‌ ఆచార్య ఎన్‌. ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. అన్ని పరీక్షలు వైవీయూ క్యాంపస్‌లో మాత్రమే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతున్న కళాశాలల నుంచి హాల్‌టికెట్లు తీసుకోవాలన్నారు. పరీక్ష టైం టేబుల్‌ కూడా అక్కడే లభిస్తుందన్నారు. పరీక్ష ప్రారంభమయ్యే సమయానికంటే అరగంట ముందే యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌ కలాం సెంట్రల్‌ లైబ్రరీ పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

వైవీయూలో భారీ ట్రీ ప్లాంటేషన్‌ డ్రైవ్‌

వైవీయూ : ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా యోగివేమన విశ్వవిద్యాలయం మొక్కల పెంపకం డ్రైవ్‌ను ప్రారంభించింది. బాలుర వసతి గృహ పరిసరాల్లో 100 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్‌ చాన్సలర్‌ మాట్లాడుతూ యూనివర్సిటీ క్యాంపస్‌ హరిత వనంలా మార్చడానికి, పర్యావరణ సుస్థిరతను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన ఒక సమష్టి కృషి ఈ కార్యక్రమం అన్నారు. ప్రిన్సిపాల్‌, ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌ ఆచార్య ఎస్‌.రఘునాథరెడ్డి మొక్కలు నాటే ప్రక్రియ నిరంతరం కొనసాగేలా చూడాలని ఎన్‌ఎస్‌ఎస్‌కు సూచించారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపల్‌ ఆచార్య పి.పద్మ, అకడమిక్‌ అఫైర్స్‌ డీన్‌ ప్రొఫెసర్‌ ఎ.జి. దాము, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్‌ ఎన్‌.ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్‌ వి.వెంకటరాముడు. వార్డెన్లు డాక్టర్‌ రామమనోహర్‌రెడ్డి, డాక్టర్‌ వరప్రభాకర్‌, డాక్టర్‌ శ్రీనివాసులురెడ్డితోపాటు హాస్టల్‌ సిబ్బంది, ఔత్సాహిక విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కలు నాటి నీరు పోస్తున్న వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, అధ్యాపకులు

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం


కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ఎస్సీ వర్గీకరణపై ఆర్టికల్‌ 341 ప్రకారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధంగా ఉందని ఏపీ రాష్ట్ర మాలమహానాడు గౌరవ అధ్యక్షులు జాకట విజయశేఖర్‌ అన్నారు. శుక్రవారం ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ శివశంకర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరు సురేష్‌, రాయలసీమ అధ్యక్షులు జేష్ఠాది భాస్కర్‌, నగర అధ్యక్షులు చెంచుల డేవిడ్‌ సత్యరాజ్‌, జమ్మలమడుగు తాలూకా అధ్యక్షులు దీపక్‌, పోతుబోయిన చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పరేడ్‌కు కడప విద్యార్థులు


ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్‌ అశోక్‌ను అభినందిస్తున్న ఆర్ట్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డా. జి. రవీంద్రనాథ్‌, పీఓలు


ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్‌ ఎల్‌. భువనను అభినందిస్తున్న మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ వి. సలీంబాషా

వైవీయూ: దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించనున్న స్వాతంత్య్ర దిన వేడుకలకు కడప నగరానికి చెందిన ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు ఎంపికయ్యారు. కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్‌ ఎం. అశోక్‌, ఎస్‌కేఆర్‌ అండ్‌ ఎస్‌కేఆర్‌ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్‌ ఎల్‌. భువన ఎర్రకోటలో నిర్వహించే వేడుకలకు ఎంపికయ్యారు. దీనికి సంబంధించి కేంద్ర యువజన సర్వీసులు, క్రీడామంత్రిత్వ శాఖ నుంచి వీరికి ఆహ్వానాలు లభించాయి. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లను ఆర్ట్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డా. జి. రవీంద్రనాథ్‌, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డా. వి. సలీంబాషా వేర్వేరుగా అభినందించారు.

యువత సమస్యల పరిష్కారం కోసం పోరు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : యువత సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంత పోరాటం చేస్తున్నామని యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్‌ కుమార్‌ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఇండియన్‌ యూత్‌ కాంగ్రెస్‌ 64వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్‌ జెండాను ఆవిష్కరించి మొక్కలు నాటారు. నాయకులు ఎం.విజయ్‌ కుమార్‌, సూర్య వంశీ, శ్రీసాయి, శివప్రసాద్‌, మహబూబ్‌ బాషా, చక్రి, ప్రభుకుమార్‌, ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు తొలి శ్రావణ శనివారం పూజలు

- వైష్ణవాలయాల్లో భక్తుల సందడి


దేవుని కడప ఆలయం

కడప కల్చరల్‌ : శ్రీ మహావిష్ణువు జన్మించింది శ్రవణా నక్షత్రంలో గనుక ఈ మాసాన్ని వైష్ణవులకు అత్యంత పవిత్ర మైనదిగా భావిస్తారు. ఈ మాసమంతా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గడిపేందుకు ప్రయత్నిస్తారు. గత ఆదివారం అమావాస్యతో ఆషాఢ మాసం ముగిసి సోమవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభమైంది. శ్రావణమాసంలో శనివారాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉన్నా శుక్ర వారాలకు కూడా దాదాపు అదేస్థాయి ప్రాముఖ్యత ఉంది. ఈ మాసంలో వచ్చే రెండవ శుక్రవారం (పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం) నాడు శ్రీ పార్వతిమాతకు శ్రీ మంగళగౌరి పూజలు, లక్ష్మీదేవికి వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తారు. ఈ మాసంలో నాలుగు శనివారాలు పవిత్రమైనవిగా భావించి ఆరోజున వైష్ణవాలయాలలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉదయం 4.30 గంటల నుంచి ఆలయాలలో వారి సంప్రదాయాలను బట్టి సుప్రభాత సేవలు, విశేష అభిషేకాలు చేసి దేవతా మూర్తులను కనుల పండువగా అలంకరించనున్నారు.

ఆలయాల్లో సందడి

ఈ మాసమంతా వైష్ణవాలయాలలో భక్తుల సందడి పెద్దగా కనిపిస్తుంది. మాసంలో తొలి శ్రావణ శనివారం రావడంతో భక్తుల్లో మరింత ఉత్సాహం కనిపిస్తోంది. ఈ మాసంలోని నాలుగు శనివారాలలో విశేష పూజోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీల ప్రతినిధులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా భక్తులచే సామూహిక పూజలు నిర్వహించేందుకే ఈ మాసంలో ప్రాధాన్యత ఇస్తారు.

నగరంలో..

కడప నగరంలో ప్రధానంగా దేవునికడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఆ తర్వాత కడప నగరం బీకేఎం వీధిలోని శ్రీ కోదండ రామాలయం, నకాష్‌లోని శ్రీ పాండురంగ స్వామి ఆలయం, హౌసింగ్‌బోర్డులోని శ్రీ కోదండరామస్వామి ఆలయం, ఇందిరానగర్‌లోని శ్రీ భద్రాద్రి రామాలయంతోపాటు నగరంలోని దాదాపు 40కి పైగా ఉన్న వైష్ణవాలయాల్లో మాసమంతా విశేష పూజలు నిర్వహిస్తారు. నగర వాసులు శివార్లలోని పాలకొండల్లోగల శ్రీ పాలకొండ్రాయస్వామి ఆలయానికి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహిస్తారు. అటు పుణ్యం, ఇటు విహారయాత్ర అనుభూతి లభిస్తాయి గనుక ఈ మాసంలోని నాలుగు శనివారాలలో పాలకొండ భక్తులతో సందడిగా కనిపిస్తుంది. కడప గ్రూప్‌ ఆఫ్‌ టెంపుల్స్‌ ఈఓ శ్రీధర్‌, నగర ఆలయాల అర్చకులు ఇప్పటికే ఈ మాసంలో చేపట్టాల్సిన విశేష పూజలకు ఏర్పాట్లు చేశారు.

విజయదుర్గమ్మకు విశేష పూజలు


విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్‌ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం 10.30 గంటలకు కార్యక్రమానికి హాజరైన భక్తులచే అర్చకులు పూజా విధానాన్ని వివరిస్తూ సుమంగళి పూజను నిర్వహింపజేశారు. శ్రావణమాసం తొలి శుక్రవారం నాడు అమ్మవారిని దర్శించుకోవడం శుభదాయకమని భావించి ఇతర ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు కూడా పూజల కోసం తరలివచ్చారు. రాత్రి 8 గంటలకు పల్లకీ సేవ నిర్వహించారు. వచ్చే శుక్రవారం వరలక్ష్మీవ్రతం కావడంతో విశేష పూజలు ఉంటాయని, భక్తులు పాల్గొనవచ్చని ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్‌ తెలిపారు.

నగరపాలక కమిషనర్‌గా గ్రూప్‌–1 అధికారి?

కడప కార్పొరేషన్‌ : కడప నగర పాలక సంస్థ కమిషనర్‌గా గ్రూప్‌–1 అధికారి రానున్నారా... అవుననే అంటున్నాయి కార్పొరేషన్‌ వర్గాలు. కడప కార్పొరేషన్‌ను మెట్రో సిటీలతో పోటీ పడేలా అభివృద్ధి చేయాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఐఏఎస్‌ అధికారి అయిన జీఎస్‌ఎస్‌ ప్రవీణ్‌ చంద్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన తనదైన శైలిలో కడపను అభివృద్ధి చేశారు. మున్సిపల్‌ కార్పొరేషన్‌కు ఒకసారి ఐఏఎస్‌ను నియమించాక మళ్లీ ఐఏఎస్‌నే నియమిస్తారని అందరూ భావించారు. అనుకున్నట్టే కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఇటీవల జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో తిరుపతి జేసీగా ఉన్న తేజ్‌ భరత్‌ను నియమించింది. పదిహేను రోజులు కావొస్తున్నా ఆయన విధుల్లో చేరలేదు. నగరపాలక పడకేసింది... అధికారులు, ఉద్యోగుల్లో అంతకుముందున్న చురుకుదనం లోపించింది. ఇంతకీ ఏమై ఉంటుందబ్బా... అని ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే టీడీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి, కడప ఎమ్మెల్యే చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. ఐఏఎస్‌ అధికారి అయితే ఎవరి మాట వినరని, గ్రూప్‌–1 అధికారి అయితే తాము చెప్పినట్లు నడుచుకుంటారని, అడిగిందే తడవుగా తమ పనులన్నీ చక్కబెడతారని, తాము ఎక్కడికి పిలిచినా వస్తారని దీర్ఘాలోచన చేసి కమిషనర్‌గా ఐఏఎస్‌ అధికారి రాకుండా అడ్డుపుల్ల వేసినట్లు సమాచారం. ఆ గ్రూప్‌–1 అధికారిని కూడా తమ సమీప బంధువునే వేయించుకునేలా ప్లాన్‌ చేసినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి


ఆర్డీఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న అఖిలపక్ష నేతలు

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : కడప నగరం చిన్నచౌకు సర్వే నెంబరు 247/2లో 3.43 సెంట్ల వంక పోరంబోకులో సుమారు 1.50 సెంట్ల ప్రభుత్వ భూమిని ఓ రియల్‌ ఎస్టేట్‌ సంస్థ వారు ఆక్రమించారని, దానిని స్వాధీనం చేసుకోవాలని అఖిలపక్ష కమిటీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు కడప ఆర్డీఓకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబరు 247/2లోని ప్రభుత్వ భూమిలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కడప కలెక్టరేట్‌ కోరి ఉన్నారన్నారు. కానీ అందుకు భిన్నంగా పేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూమిని రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులు ఆక్రమించి 50 అడుగుల రోడ్డు, అపార్టుమెంటు నిర్మిస్తుంటే చూస్తూ ఉండిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్‌ నారాయణ, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి గుర్రప్ప, దళిత ఫోరం జిల్లా చైర్మన్‌ కిశోర్‌బాబు, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి ప్రసాద్‌రావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కడప సెవెన్‌రోడ్స్‌ : కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఆదేశాల మేరకు ఆగస్టు 12 నుంచి 14వ తేది వరకు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో సర్పంచులు, గ్రేడ్‌–1 నుంచి గ్రేడ్‌–5 వరకు, పంచాయతీ కార్యదర్శులకు మండల స్థాయిలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం విజయవంతానికి ఆయా మండలాల ఎంపీడీఓలు, ఏఓలు, ఈఓపీఆర్‌డీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీలో శిక్షణ నిర్వహణపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచులకు గ్రేడ్‌–1 నుంచి గ్రేడ్‌–5 వరకు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణను వంద శాతం విజయవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాలలో ఉమ్మడి వైఎస్సార్‌ జిల్లాలోని ఎంపీడీఓలు, ఏఓలు, ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్‌ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పదోన్నతుల తర్వాతనే పని సర్దుబాటు చేయాలి


డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఆపస్‌ నాయకులు

కడప ఎడ్యుకేషన్‌: పాఠశాలల్లోని అన్ని స్థాయిల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులు పూర్తి చేసిన తర్వాతనే పని సర్దుబాటు చేయాలని ఆంధ్రప్రదేశ్‌ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కొండారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్రామిరెడ్డి కోరారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధను తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని సర్దుబాటు కూడా జీవో నెంబర్‌ 117 ద్వారా కాకుండా జీవో నెంబర్‌ 53 ద్వారానే చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పది దాటితే ఇద్దరు, 40 దాటితే ముగ్గురు , 60 దాటితే నలుగురు ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆపస్‌ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, చంద్రమోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆచూకీ తెలిస్తే సంప్రదించాలి

- జిల్లా జడ్జి ఎస్‌. బాబా ఫక్రుద్దీన్‌

కడప అర్బన్‌ : మానసిక మహిళ సమాచారం తెలిసిన బంధువులు తమను సంప్రదించాలని కడప జిల్లా జడ్జి ఎస్‌. బాబాఫక్రుద్దీన్‌ ఓ ప్రకటనలో కోరారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని నేహా మారియా మానసిక కేంద్రం కార్యకర్త పంపిన లేఖ మేరకు.. 2022 నవంబర్‌, 15న జయలక్ష్మి మానసిక రోగంతో కేంద్రానికి వచ్చిందన్నారు. ఆమె స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం మాచర్ల అని పేర్కొన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 08562–244622, 258622లో సంప్రదించాలని తెలియజేశారు.